యువత రాజకీయాల్లోకి రావాలి

జెండా తిరంగ్ ర్యాలీలో పాల్గొన్న ఆర్.కృష్ణయ్య, గుజ్జ కృష్ణ, రామకృష్ణ, విద్యార్థులు

కాచిగూడ, జనవరి 25 : భారతదేశం మరింతగా అభివృద్ధి చెందాలంటే యువత రాజకీయాల్లోకి రావాలని రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య పిలుపునిచ్చారు. జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు వేముల రామకృష్ణ ఆధ్వర్యంలో శనివారం బర్కత్‌పుర చౌరస్తాలో జెండా తిరంగ్ ర్యాలీని విద్యార్థులతో భారీ ఎత్తున నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆర్.కృష్ణయ్య హాజరై మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా ఉన్న యువతలో జాతీయ సమైక్యతను పెంపొందించి, స్వాతంత్ర్య సమర యోధుల చరిత్రలను యువతకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రధాని మోదీ రాజకీయాల్లో యువతకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని, యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాజకీయాల్లోకి యువత రాకపోతే దేశ ప్రతిష్ఠ దిగజారిపోతుందని పేర్కొన్నారు. ప్రపంచదేశాలకు దీటుగా భారతదేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నీలం వెంకటేష్, రాజేందర్, నందగోపాల్, అనంతయ్య, సుధాకర్, ఉదయ్ నేత, మోడీరామ్‌దేవ్, నిఖిల్, పలు కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

చాంపియన్‌షిప్ దక్కించుకున్న కస్తూర్బా విద్యార్థినులు

విజేతలకు ట్రోఫీని అందజేస్తున్న ఎగ్జిబిషన్ సొసైటీ కోశాధికారి డాక్టర్ ప్రభాశంకర్, స్పోర్ట్స్ కన్వీనర్ మంజిత్‌రెడ్డి, సలహాదారులు అనిల్‌స్వరూప్ మిశ్రా తదితరులు

అబిడ్స్, జనవరి 25 : సరోజిని నాయుడు వనిత ఫార్మసీ మహా విద్యాలయ కళాశాలలో ఇంటర్ కాలేజీ గర్ల్స్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థినులు పాల్గొనగా కస్తూర్బా గాంధీ మహిళా కళాశాల సికింద్రాబాద్ విద్యార్థినులు చాంపియన్‌షిప్‌ను దక్కించుకున్నారు. ఈ సందర్భంగా ఎగ్జిబిషన్ సొసైటీ కోశాధికారి డాక్టర్ బి. ప్రభాశంకర్ ఎగ్జిబిషన్ సొసైటీ స్పోర్ట్స్ కమిటీ సలహాదారులు అనిల్ స్వరూప్ మిశ్రా, కన్వీనర్ మంజిత్ రెడ్డి, సొసైటీ వాలంటీర్స్ కన్వీనర్ హనుమంతరావుతో కలిసి విజేతలకు ట్రోఫీని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిబిషన్ సొసైటీ ప్రతినిధులు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

రైతులకు చేదోడు వాదోడుగా చైతన్య సేద్యం

చైతన్య సేద్యం డైరీని ఆవిష్కరిస్తున్న ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్

అబిడ్స్, జనవరి 25 : వ్యవసాయ రంగంలోని ఆధునిక మార్పులను ఎప్పటికప్పుడు రైతులకు అందిస్తూ చైతన్య సేద్యం రైతులకు చేదోడు వాదోడుగా ఉంటున్నదని తెలంగాణ ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ పేర్కొన్నారు. తన కార్యాలయంలో చైతన్య సేద్యం డైరీని ఆయన ఆవిష్కరించారు. అనంతరం మెట్టు సాయికుమార్ మాట్లాడుతూ.. ఎన్నో వ్యయ ప్రయాసల కోర్చి చైతన్య సేద్యం మాస పత్రికను వెలువరిస్తున్నందుకు అభినందనలు తెలిపారు. ప్రతి సీజన్‌లో రైతులకు అవసరమైన సాంకేతిక సమాచారాన్ని మార్కెట్‌లో వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు రైతులకు అందించడం శుభ పరిణామమన్నారు. అన్ని పంటలకు కనీస మద్దతు ధర చెల్లించాలని రుణ మాఫీ సహా దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న డిమాండ్లపై చర్చలు జరిపి నూతన మార్కెట్ విధానాలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చైతన్య సేద్యం పత్రిక మేనేజర్ మూడ్ శోభన్, సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులు ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించాలి

టిప్పుఖాన్ బ్రిడ్జి వద్ద ట్రాఫిక్‌పై నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొన్న వాసవీ ఇంజినీరింగ్ కాలేజీ, గోల్కొండ ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు

మెహిదీపట్నం, జనవరి 25 : యువకులు వాహనాలను వేగంగా నడిపి ప్రమాదాలకు గురికావద్దని గోషామహల్ ట్రాఫిక్ డివిజన్ ఏసీపీ ధనలక్ష్మి అన్నారు. శనివారం లంగర్‌హౌస్ టిప్పు ఖాన్ పుల్ బ్రిడ్జి వద్ద టోలిచౌకి ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో రోడ్డ భద్రతా మాసోత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన గోషామహల్ ట్రాఫిక్ ఏసీపీ ధనలక్ష్మి మాట్లాడుతూ.. కాలేజీల విద్యార్థులు ట్రాఫిక్ నియమనిబంధనలను పాటించాలని, రోడ్డు ప్రమాదాలను నివారించడానికి కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ సమీఉజ్జమా, ఆర్‌ఎస్‌ఐ అశోక్ కుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో ..

కార్వాన్ నియోజకవర్గం లంగర్‌హౌస్ డివిజన్‌లోని ప్రశాంత్‌నగర్‌లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో శనివారం పశ్చిమ మండలం ఆర్టీవో అధికారులు రోడ్డు భద్రతా మాసోత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐ సింగం శ్రీనివాస్ రావు, వెంకటసురేశ్, ఏఎంవీఐలు అఖిల, కోటిరెడ్డిలు పాల్గొని విద్యార్థులకు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు.



ప్రశాంత్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన రోడ్డు భద్రతా మాసోత్సవాలలో పాల్గొన్న ఆర్టీవో అధికారులు

ఈ నెల 28న టీజీ ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సభ

తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ హైదరాబాద్ రీజియన్ అధ్వర్యంలో ఈ నెల 28న బొమ్మిడి నాగిరెడ్డి గార్డెన్‌లో నిర్వహించే 11వ వార్షికోత్సవ సభలు విజయవంతం చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని అధ్యక్షుడు పూస నరసింహ బెస్త, కార్యదర్శి డోలక్ క్రిష్ణలు తెలిపారు. ఈ విషయమై శనివారం గౌలిగుడాలోని ఎంజీబీఎస్ బస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు.

– కార్వాన్, జనవరి 25

ఓటు హక్కును.. వినియోగించుకోవాలి

జాతీయ ఓటర్లదినోత్సవం సందర్భంగా ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ కమిషనర్ మారుతి దివాకర్

అంబర్‌పేట/ కాచిగూడ, జనవరి 25: ప్రజాస్వామ్యం పటిష్ఠంగా ఉండాలంటే, ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ ఎ.మారుతి దివాకర్ పిలుపునిచ్చారు. 15వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం కాచిగూడ ప్రభుత్వ కళాశాలలో ఏర్పాటు చేసిన ఓటరు చైతన్య కార్యక్రమంలో మారుతి దివాకర్ పాల్గొని మాట్లాడుతూ.. దేశ పౌరుడిగా గుర్తించబడాలంటే ప్రతి ఒక్కరూ ఓటు హక్కును తప్పకుండా వినియోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ నోడల్ అధికారి రజిత, కళాశాల ప్రిన్సిపాల్ ఎ. చిరంజీవి, కె. విజయలక్ష్మి, ప్రసాద్‌రావు, డాక్టర్ లక్ష్మయ్య గంగపుత్ర, రామ్ మోహన్, అనిల్‌రెడ్డి, బుష్రా, మీరజుద్దీన్, ప్రభాకర్, వీరేశం, శోభ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని అంబర్‌పేట నియోజకవర్గంలో శనివారం ఘనంగా నిర్వహించారు. బాగ్‌అంబర్‌పేట డివిజన్ భరత్‌నగర్ కమ్యూనిటీహాల్‌లో బీఎల్‌ఓ సూపర్‌వైజరీ ఆఫీసర్ అశోక్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ ఓటర్ల దినోత్సవంలో సికింద్రాబాద్ పార్లమెంట్ బీజేపీ సంయుక్త కార్యదర్శి ఈ. అజయ్‌కుమార్ పాల్గొని మాట్లాడుతూ.. ప్రజలకు రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఎల్‌ఓలు సుజాత, సువర్ణ, పరమేశ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే నల్లకుంట డివిజన్ ఫీవర్ చౌరస్తాలో కూడా పలువురు నాయకులు ఓటు హక్కును ఖచ్చితంగా వినియోగించుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు మధుయాదవ్, కుమార్, అజయ్, కిష్టయ్య, శైలు, శ్రీనివాస్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

భరత్‌నగర్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న బీఎల్‌ఓ అశోక్ తదితరులు

సైఫాబాద్ సైన్స్ కళాశాలలో ఓటర్ దినోత్సవం

సైఫాబాద్‌లోని సైన్స్ కళాశాలలో నిర్వహించిన జాతీయ ఓటరు దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. శైలజ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. అరవింద్‌తో పాటు డాక్టర్ సీహెచ్ వెంకటేశ్వర్లు, డాక్టర్ పి. నరేశ్‌లతో పాటు బోధనా, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

– సుల్తాన్‌బజార్, జనవరి 25

సంవిధాన్ గౌరవ్ అభియాన్

సంవిధాన్ గౌరవ్‌అభియాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం మహారాజ్‌గంజ్‌లోని సావిత్రి కన్య పాఠశాలలో విద్యార్థులకు పలు అంశాలలో పోటీలు నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. బీజేపీ జీహెచ్‌ఎంసీ ఫ్లోర్ లీడర్ జి. శంకర్ యాదవ్, నాయకులు పాండుయాదవ్, క్రాంతికుమార్, రఘునందన్‌యాదవ్, స్వప్న, సీతాలత పాల్గొన్నారు.

– సుల్తాన్‌బజార్, జనవరి 25

నుమాయిష్‌ను సందర్శించిన సింగర్ సాధన సర్గం

అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శనను సందర్శించిన ప్రముఖ బాలివుడ్ సింగర్ సాధన సర్గం

అబిడ్స్, జనవరి 25 : నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో కొనసాగుతున్న అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శనను బాలివుడ్ సింగర్ సాధన సర్గం సందర్శించారు. ఎగ్జిబిషన్ సొసైటీ కల్చరల్ ప్రోగ్రాం సబ్ కమిటీ కన్వీనర్ ముఖైర్ హైదర్ ఆధ్వర్యంలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలలో ఆమె పాల్గొని పాటలు పాడి సందర్శకులకు వీనులవిందు చేశారు. అనంతరం ఎగ్జిబిషన్ మైదానాన్ని మినీ ట్రైన్ ద్వారా కలియ తిరిగి నుమాయిష్ కోసం పాటు పడుతున్న ఎగ్జిబిషన్ సొసైటీ ప్రతినిధులను ఆమె అభినందించారు. ఎగ్జిబిషన్ సొసైటీ కార్యదర్శి బి. సురేందర్‌రెడ్డి, కోశాధికారి డాక్టర్ బి. ప్రభాశంకర్, ఎగ్జిబిషన్ సొసైటీ సభ్యులు, క్లబ్ కన్వీనర్ ఏనుగుల రాజేందర్, కల్చరల్ ప్రోగ్రామ్స్ సబ్ కమిటీ కన్వీనర్ ముఖైర్ హైదర్ ఆమెకు ఘన స్వాగతం పలికి సత్కరించారు.

బీసీల సామాజికాభివృద్ధికి తక్షణ చర్యలు తీసుకోవాలి

కాచిగూడ,జనవరి 25: కేంద్ర ప్రభుత్వం బీసీల విద్య, ఉద్యోగ, ఆర్థిక, సామాజికాభివృద్ధికి తక్షణ చర్యలు తీసుకోవాలని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్‌పటేల్‌గౌడ్ డిమాండ్ చేశారు. శనివారం రాష్ట్ర బీసీ నాయకులతో కలిసి నింబోలిఅడ్డా కార్యాలయంలో రాజేందర్‌పటేల్‌గౌడ్ మాట్లాడుతూ గతంలో కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ దేశ వ్యాప్తంగా ఉన్న అన్ని కులాల లెక్కలు తీస్తామని హామీ ఇచ్చాడని, ఆ హామీని నిలబెట్టుకోవాలని అన్నారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి, చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసి, కేంద్రం చేపట్టబోయే జనగణనలో కుల గణన చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పి.కృష్ణ, ముత్యాల్‌రావు, ప్రశాంత్ నిమ్‌కర్, కిషోర్‌గౌడ్, సత్యపాల్‌సింగ్, భాస్కర్, ప్రదీప్‌గౌడ్, పాల్గొన్నారు.

నంద నరేశ్‌కు డాక్టరేట్

ఒగ్గు కళాకరుడు నంద నరేశ్‌కు డాక్టరేట్‌ను అందజేస్తున్న రిటైర్డ్ జడ్జి మధుసూదన్ తదితరులు

కాచిగూడ, జనవరి 25: ఒగ్గు కళా రంగాన్ని అధ్యయనం చేసి, గ్రామస్థాయి వరకు తీసుకెళ్లిన ఒగ్గు కళాకారుడు నంద నరేశ్‌కు బర్కిలీ, చికాగో(యూఎస్‌ఏ)కు చెందిన యునైటెడ్ థియోలాజికల్ రీసెర్చ్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌ను శనివారం యూనివర్సిటీలో రిటైర్డ్ జడ్జి మధుసూదన్ అందజేశారు. ఈ సందర్భంగా నంద నరేశ్ విలేకరులతో మాట్లాడుతూ.. ప్రస్తుత టెక్నాలజీ సహాయంతో ఒగ్గు కళా రంగాన్ని అధ్యయనం చేసిన సేవలను గుర్తించి డాక్టరేట్‌ను ఇవ్వడం ఆనందంగా ఉందని అన్నారు. ఈ సందర్భంగా నరేశ్‌ను వండర్ బుక్ ఆఫ్ రికార్డ్ ఇండియా చీఫ్ కో ఆర్డినేటర్ బింగి నరేందర్‌గౌడ్, ఒగ్గు కళాకారులు అభినందించారు.

ఎగ్జిబిషన్‌లో కుకింగ్ పోటీలు

నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో శనివారం కుకింగ్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో ఎగ్జిబిషన్ సొసైటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న కళాశాలలకు చెందిన విద్యార్థినులు ఈ పోటీలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబర్చిన వనితా ఫార్మసీ విద్యార్థిని హస్న మహ్‌వీన్‌కు కన్వీనర్ సంధ్య దేపాల బహుమతిని ప్రదానం చేశారు. – అబిడ్స్

వ్యక్తి అదృశ్యం..



గోవింద్

కాచిగూడ, జనవరి 25: అప్పుల బాధతో ఓ కూలి అదృశ్యమయ్యాడు. కాచిగూడ ఎస్సై హెచ్. నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణానగర్ ప్రాంతానికి సల్గారే గోవింద్(34) కూలీ. అప్పుల బాధతో ఈ నెల 22వ తేదీన ఇంట్లోంచి వెళ్లిన గోవింద్ ఇప్పటికీ తిరిగి రాకపోవడంతో కలత చెందిన భార్య అనిత శనివారం కాచిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఇంట్లోంచి గోవింద్ వెళ్లే సమయంలో నలుపు రంగు చొక్క, నీలిరంగు ప్యాంట్ ధరించి, ఎత్తు 5.5 ఉన్నట్లు పోలీసులు తెలిపారు. భార్య ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత



ప్రజలకు ప్రభుత్వ పథకాలను అందించడానికి అధికారులు కృషి చేయాలని కార్వాన్ నియోజకవర్గం ఎమ్మెల్యే మహ్మద్ కౌసర్‌మొహినుద్దీన్ అన్నారు. శనివారం టోలిచౌకిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఎనిమిది మందికి మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే కౌసర్‌మొహినుద్దీన్ అందించారు.

– మెహిదీపట్నం, జనవరి 25

వనితా మహా విద్యాలయ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేస్తున్న హరి చందన

అబిడ్స్, జనవరి 25 : సరోజిని నాయుడు వనితా మహా విద్యాలయ గ్రాడ్యుయేషన్ డే వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర రోడ్డు, భవనాల శాఖ స్పెషల్ సెక్రటరీ హరిచందన ముఖ్య అతిథిగా పాల్గొని 2024 బ్యాచ్‌కు చెందిన విద్యార్థినులను పట్టాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా హరిచందన మాట్లాడుతూ.. తాను ఐఏఎస్ కావడానికి ఏ విధంగా కష్ట పడ్డాననే విషయాన్ని విద్యార్థినులకు వివరించారు. విద్యలో మంచి ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బంగారు పథకాలు, సర్టిఫికెట్‌లను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ అష్ఫక్ హైదర్, వైస్ చైర్మన్ డాక్టర్ అలేఖ్య పుంజాల, సెక్రటరీ ఏనుగుల రాజేందర్ కుమార్, కోశాధికారి ఫారూఖీ, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి శోభన, కళాశాల పాలకమండలి సభ్యులు, విభాగాధిపతులు, అధ్యాపకులు, తల్లిదండ్రులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

నిజాం కళాశాలలో యువ ఎంపవర్-2025

నిజాం కళాశాలలో నిర్వహించిన యువ ఎంపవర్-2025లో పాల్గొన్న వివిధ కళాశాలల విద్యార్థులు, అధ్యాపకులు

సుల్తాన్ బజార్, జనవరి 25 : అయిస్టర్ ఎన్జీఓ మరియు లిటరరీ అండ్ కల్చరల్ క్లబ్ అధ్వర్యంలో శనివారం నిజాం కళాశాల ప్రాంగణంలో నగరంలోని వివిధ కళాశాలల విద్యార్థులకు యువ ఎంపవర్-2025 పేరుతో పలు అటల పోటీలు నిర్వహించారు. ఈ క్రమంలో కళాశాల ఆవరణలో సందడి వాతావరణం కనిపించింది. క్యారమ్స్, చెస్, రంగోలి, ఉపన్యాసం, వ్యాసరచన, సింగింగ్, డ్యాన్స్, క్విజ్, తదితర అంశాలలో పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న నిజాం కళాశాల ప్రిన్సిపాల్ ఏవీ రాజశేఖర్ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగిఉన్న ప్రతిభా పాటవాలను వెలికి తీయడానికి ఈ పోటీలు దోహదపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో నిజాం కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జి. ఉపేందర్‌రెడ్డి, అకాడమిక్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఎస్. రేణుకా, డాక్టర్ అప్కా నాగేశ్వర్‌రావు, డాక్టర్ రాధిక, స్వాతి, లక్ష్మి, డాక్టర్ హారతి, డాక్టర్ కవిత షిండే, తదితరులు పాల్గొన్నారు.

చివరి దశకు ఇందిరమ్మ ఇండ్ల సర్వే

అబిడ్స్, జనవరి 25 : ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల పరిశీలన చివరిదశకు చేరింది. జీహెచ్‌ఎంసీ సర్కిల్ – 14 కార్యాలయం పరిధిలోని బస్తీలు, కాలనీలలో అధికారులు, సిబ్బంది ఇందిరమ్మ ఇండ్ల కోసం అందిన దరఖాస్తులను పరిశీలిస్తున్నారు. సర్కిల్–14 పరిధిలో గత సంవత్సరం 34,046 మంది దరఖాస్తులు రాగా అందులో 23,237 దరఖాస్తుల పరిశీలన పూర్తయ్యింది. దరఖాస్తులు చేసిన వారు ఇందిరమ్మ ఇండ్లకు అర్హులా కాదా అని సిబ్బంది ఇంటింటికీ తిరిగి పరిశీలిస్తున్నారు. దరఖాస్తుదారులను నేరుగా కలిసి వారిచ్చే వివరాలను యాప్ ద్వారా నమోదు చేస్తున్నారు. అంతేకాకుండా లొకేషన్‌తో కూడిన ఫొటోలను యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. సెల్ఫ్ హెల్ప్ గ్రూపు సభ్యులతో పాటు జీహెచ్‌ఎంసీకి చెందిన వివిధ విభాగాలకు చెందిన సిబ్బంది ఈ దరఖాస్తుల పరిశీలన చేపడుతున్నారు. సర్కిల్ డిప్యూటీ కమిషనర్ విద్యాధర్ పర్యవేక్షణలో అధికారులు సిబ్బంది ఇంటింటికీ తిరిగి దరఖాస్తులను పరిశీలిస్తుండగా, ఇన్‌చార్జులు పర్యవేక్షిస్తున్నారు. ఇదిలా ఉండగా రేషన్‌కార్డుల కోసం వచ్చిన 1,793 దరఖాస్తుల పరిశీలన పూర్తయినట్లు తెలిపారు.

జోనల్ కమిషనర్ పర్యటన ..

గోషామహల్ నియోజకవర్గం లోని పలు ప్రాంతాలలో జీహెచ్‌ఎంసీ సర్కిల్–14 డిప్యూటీ కమిషనర్ ఎస్ విద్యాధర్ పర్యటించారు. బస్తీలు, కాలనీలలో అధికారులు, సిబ్బంది చేపడుతున్న దరఖాస్తుల పరిశీలనను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యాధర్ మాట్లాడుతూ సర్కిల్ కార్యాలయం పరిధిలోని 34,076 మంది దరఖాస్తు చేసుకోగా అందులో 23,237 దరఖాస్తుల పరిశీలన పూర్తయ్యిందని, దీంతో 75 శాతం దరఖాస్తుల పరిశీలన పూర్తి ఐనట్లు తెలిపారు. మిగిలిన దరఖాస్తులను కూడా త్వరలో పూర్తి అయ్యేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు.

గోషామహల్ నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పరిశీలిస్తున్న సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఎస్. విద్యాధర్

దళితుల మధ్య రెడ్డి జాగృతి చిచ్చు

రవీంద్రభారతి, జనవరి 25 : రెడ్డి జాగృతి పేరుతో దాని వ్యవస్థాపక అధ్యక్షుడు, నేషనల్ ఫెడరేషన్ చైర్మన్ పిట్ట శ్రీనివాస్‌రెడ్డి ఎస్సీ వర్గీకరణకు మద్దతుగా రెడ్ల సదస్సును నిర్వహించడం సరికాదని సెంటర్ ఫర్ బెటర్ ఇండియా రీసెర్చ్ ఫౌండేషన్ ప్రతినిధులు అన్నారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సెంటర్ ఫర్ బెటర్ ఇండియా రీసెర్చ్ ఫౌండేషన్ డైరెక్టర్ మామిడి నారాయణ మాట్లాడుతూ.. తెలంగాణలో రెడ్ల జనాభా శాతం 2 నుంచి 3 శాతం ఉంటుందని, కాని 119 ఎమ్మెల్యేలలో 33 మంది ఎమ్మెల్యేలు, ఒక ముఖ్యమంత్రితో పాటు 4రు మంత్రులుగా రెడ్డి సామాజిక వర్గం కొనసాగుతున్నారని, రెడ్ల జనాభా దామాషా ప్రకారం వారికి 2ఎమ్మెల్యే సీట్లు 1 ఎంపీ సీటు మాత్రమే రావాలని, కాని రాష్ట్రంలో మొత్తం రెడ్డి సామాజిక వర్గం కొనసాగడం ఎంత వరకు సమంజసమని విమర్శించారు. రాష్ట్రంలో బీసీలు 56 శాతం ఉన్నా ఒక్క మంత్రి పదవి, ఒక్క ఎంపీ సీటు కూడా ఇవ్వకుండా బీసీలకు తీరని నష్టం చేస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. జనాభా కంటే అధికంగా పదవుల్లో ఉన్న రెడ్లు తక్షణమే రాజీనామా చేసి ఆ పదవులను బీసీలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఖైదీల క్రమశిక్షణే వారికి రక్ష

నాంపల్లి క్రిమినల్ కోర్టులు, జనవరి 25 (నమస్తే తెలంగాణ) : జైళ్లలో ఉన్న ఖైదీలందరూ క్రమశిక్షణతో ఉండాలని, వారికి అదే రక్షణగా ఉపయోగపడుతుందని హైదరాబాద్ జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి మహ్మద్ అబ్దుల్ జావేద్ పాషా అన్నారు. చంచల్‌గూడా జైలులో శనివారం ఏర్పాటు చేసిన ‘చట్టాలపై అవగాహన’ కార్యక్రమానికి హాజరై మాట్లాడుతూ.. ప్రస్తుత తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టీస్ సుజయ్‌పాల్ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఖైదీలకు, బయట ఉన్న నిందితులకు తేడా లేదని, అందరికీ సమాన హక్కులు వర్తిస్తాయన్నారు. ఇప్పటివరకు 119మంది ఖైదీలు బెయిల్‌పై విడుదలయ్యారని, ఖైదీలకు ఉచిత న్యాయసేవలందించేందుకు డిఫెన్స్ కౌన్సిల్ సిస్టంను ప్రారంభించడం జరిగిందని ఇఅన్నారు. ఒక్క నిర్దోషికి కూడా శిక్షపడకూడదనే ఉద్దేశంతోనే ఉచిత న్యాయసేవలు అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. చంచల్‌గూడా జైలులో 1738 మంది ఉన్నారని, వారిలో 529మంది ఖైదీలు ఉచిత న్యాయసేవలు పొందారని అన్నారు. ప్రతీ ఖైదీ పోలీసుల్ని ప్రశ్నించే హక్కు ఉందని, అరెస్టుకు గల కారణాల్ని తెలుసుకునేందుకు వీలుంటుదన్నారు. 10సార్లు జైలు అదాలత్ నిర్వహించి ఖైదీలను విడుదల చేసినట్లు తెలిపారు. కార్యక్రమానికి జైళ్ల శాఖ ఇన్స్పెక్టర్ జనరల్ జె.రాజేశ్, డీఎస్పీ విజయ్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు. జైళ్ల శాఖ ఇన్స్పెక్టర్ జనరల్ జె.రాజేశ్ మాట్లాడుతూ..కొత్త చట్టాల ప్రకారం 379 బీఎన్‌ఎస్‌ఎస్ కింద గరిష్ట శిక్షపడితే అందులో ముద్దాయి సగభాగం శిక్షను పూర్తి చేసుకున్న నేపథ్యంలో నేరుగా బెయిల్ మంజూరు చేయాలని అన్నారు.

IN THE COURT OF THE HON'BLE PRL. JUNIOR CIVIL JUDGE VIKARABAD DISTRICT : AT VIKARABAD
OS.No. 239 OF 2020
Between:
Kamli Bai ... Plaintiff
And
Surya & other ... Defendants
NOTICE
To
4. Y. Vinod Reddy S/o Y. Ram Reddy, Aged about 51 years, Occ: Business, R/o. H.No. 2-221/7, SBH Colony, Bagh Amberpet, Hyderabad ... Defendant No.4
Please take notice that the plaintiff herein has filed the suit for Partition & Separate Possession before the Hon'ble Prl., Junior Civil Judge, Vikarabad and the Hon'ble Court was pleased to post the above matter for appearance of the defendant No.4 on 03.02.2025 and the defendant no.4 hereby called upon to appear before the Hon'ble Court by person or through counsel by 10.30 AM otherwise the matter will be heard exparte. This is for your information.
//BY ORDER OF THE COURT//
Sd/- **Mohd Rafi, Mohd Hasham**
Advocates, H.No. 4-1-512/2, Near Cinemax Theater, MIG Phase 1 Colony, Vikarabad- 501101, Cell: 9394531766